త్రైత సిద్ధాంతము

గ్రంథ సేకరణ : మన పండుగలు

# యుగ ఆది – యుగాది – ఉగాది

కంటికి కనిపించు ఈ జగత్తంతయు ఒక రోజు ప్రారంభమై ఆనాటినుండి కొనసాగుచూనే ఉన్నది. ప్రపంచములోని జీవరాసులన్నిటికి చావు పుట్టుకలు గలవు. అందువలననే ఈ జీవ రాసులన్నిటినీ జగతి అంటున్నారు. **'జ'** అనగ పుట్టునదని **'గతి'** అనగా చావునదని అర్థము గలదు. జగతి అను శాశ్వత నామమును గల్గిన ఈ జీవ సముదాయము ఏదో ఒక రోజు పుట్టి, ఏదో ఒక రోజు లేకుండ పోవునదని అందరు తెలుసుకోవలయును. ఒక మనిషి పుట్టి కొంత కాలముండి చనిపోవుట అందరికి తెలిసిన సత్యమే. అతను ఉండు కొంత కాలమును అతని ఆయుస్సు అంటున్నాము. మనిషి ఆయుస్సుకు కొలమానముగ నిమిషములు మొదలుకొని సంవత్సరముల వరకు గలవు. అట్లే పుట్టి కొంత కాలముండి పోవు ప్రపంచమునకు కూడ ఆయుస్సు కలదు. దాని కొలమానము యుగముల లెక్కలో ఉండును. మనిషి పుట్టిన దినమును జన్మ దినమనియు, జాతకమనియు చెప్పుచుందురు. అట్లే ప్రపంచము పుట్టిన దినమును **'యుగ ఆది'** అనెడివారు. దానినే కొంతకాలమునకు **'యుగాది'** అనెడివారు. కాలము జరుగుకొద్ది యుగాది కూడ పోయి **'ఉగాది'** అయినది. రాబోవు కాలమునకు ఇంకా ఏ పేరుగా మారిపోతుందో తెలియదు.


నేటి కాలములో కొందరు తమ పుట్టినరోజును ప్రతి సంవత్సరములో పండుగ చేసుకొనుచుందురు. తీపి పదార్థములు పంచి తన పుట్టిన దినమని తెలియజేయుచుదురు. జన్మదిన వేడుకలు ప్రస్తుత కాలములో ప్రబలిపోయినవి. కాని పూర్వము ఎవరూ తమ జన్మదిన వేడుకలు జరుపుకొన్నట్లు చరిత్రలో లేదు. శ్రీకృష్ణాష్టమి, శ్రీరామనవమి వారు బ్రతికి ఉన్నపుడు వారు చేసుకొన్నట్లు ఆధారములు లేవు. పూర్వకాలములో వ్యక్తిగత పుట్టిన దినములు ఎవరు జరుపుకోక, సమిష్ఠిగ ప్రపంచము యొక్క పుట్టిన దినమును చేసుకొనెడివారు. ఆ దినమునకే **'యుగ ఆది'** అని పేరు పెట్టి అన్నిటికంటే మిన్నగా, దానికంటే మించిన పండుగలేనట్లు చేసుకొనెడివారు. కాలము జరుగుకొలది తర్వాత చాలా పండుగలు తయారై అన్నిటిలాగే ఇదీ ఒక పండుగైనది. ఇంకనూ కొతకాలము జరిగిపోతే ఈ పండుగ లేకుండ పోయే స్థితి ఏర్పడుతుందేమో ఇప్పటికే కొంత పేరు మారింది, కొంత ఆచరణయు మారినది. విదేశీ సాంప్రదాయమైన జనవరి మొదటి తేదీ సంవత్సరాది అయినది. రాబోవు కాలములో హిందూ సమాజములో యుగాది ఉంటుందో లేదో చెప్పలేము.

– ఇందూ జ్ఞాన వేదిక

జై శ్రీ కృష్ణ

శ్రీ కృష్ణుడు అష్టమినాడే పుట్టుటలో జ్ఞానవంతమైన అర్థము ఇమిడి ఉన్నది. పాఢ్యమి నుండి అమావాస్య వరకు ఉన్న 15 దినములలో "అష్టమి" 8వ దినము. 15 దినములలో, 'పాఢ్యమి నుండి సప్తమి' వరకు, మరియు 'నవమి నుండి అమావాస్య' వరకు రెండు భాగములు చేయగా, మధ్యన మిగిలిన అష్టమి దినమున "దేవదేవుడు" భగవంతునిగా జన్మించినాడు.

శ్రీ కృష్ణుడు జ్ఞానమునకు, అజ్ఞానమునకు సంధిలాంటివాడు. ఆయన జ్ఞానులకు జ్ఞానిగానూ, అజ్ఞానులకు అజ్ఞానిగానూ కనపడును. ఆయన ద్వంద్వములైన "పాప-పుణ్యములు, కష్ట-సుఖములు, మంచి-చెడులు, జ్ఞాన-అజ్ఞానములకు" అతీతుడనని తెలిపుటకే "అష్టమి" దినమున జన్మించాడు.




జై శ్రీ కృష్ణ



కృష్ణం వందే జగద్గురుమ్

# శ్రీకృష్ణ జన్మాష్టమి [6-9-2015]



జగద్భర్త అయిన ఆ దేవదేవుడు, జగద్గురువుగా జన్మించిన దినమే,

మానవజాతికి పండుగ జరుపుకోవలసిన దినము.

పూర్వము జ్ఞానము తెలిసిన పెద్దల ప్రకారం:

- కృష్ణాష్టమి ఇంటిలోపల చేయు పండుగకాదు.
- కృష్ణాష్టమిని పదకొండు రోజుల పండుగగా చేయవలెను.
- వీధులలోనే పందిరికట్టి, ఆ పందిరిలో కృష్ణుని ప్రతిమను పెట్టి, పదకొండు రోజులు పూజించవలెను.
- వీధిలో పందిరి ముందే కృష్ణలీలలను [ఉట్ల ఆట, వెన్న దొంగ ఆట] ప్రదర్శించవచ్చును.
- చివరి పదకొండవరోజు అనగా చవితి రోజు పందిరిలోని కృష్ణప్రతిమను ఊరేగించి, ఆ ప్రతిమను ఇంటిలో పెట్టుకొని ఉత్సవమును ముగించవలెను.

# దశర

"దశ" అనగా పది అని "ర" అనగా నాశనము అని అర్థము. ప్రతి జీవి తన దశేంద్రియములైన [ఐదు జ్ఞానేంద్రియములు + ఐదు కర్మేంద్రియములు] వాటినుండి వచ్చు కర్మను లేకుండా చేసుకోవడమే "దశర" పండుగ యొక్క ఉద్దేశ్యము.

జ్ఞానేంద్రియములు:

1. కన్ను 2. చెవి 3. ముక్కు 4. నాలుక 5. చర్మము

కర్మేంద్రియములు:

1. కాళ్ళు 2. చేతులు 3. నోరు 4. గుదము 5. గుహ్యము

# దీపావళి పండుగ

1. పరమాత్మ → ప్రకృతి → శక్తి X వ్యాధి.
2. అగ్ని → దీపము → వెలుగు X చీకటి.
3. గురువు → జ్ఞానము → ఆనందము X దుఃఖము.

పూర్వము మూడు యుగములలో తెలిసిన ఈ మూడు విధానములు కలియుగము ప్రారంభములోనే తెలియకుండాపోయాయి. అలా తెలియకుండా పోయిన దానివలన, ఆత్మజ్ఞానమునకు ముప్పు ఏర్పడునను ఉద్దేశ్యముతో, కొందరు తెలిసిన పెద్దలు దేవుడు, గురువు అంటే ఎవరని అందరికీ తెలియునట్లు, అట్లే ప్రకృతి మరియు దైవజ్ఞానము ఏమిటో తెలియునట్లు, శక్తి ఆనందము ఎక్కడినుండి లభించుచున్నాయో అర్థమగునట్లు వాటికి ఉదాహరణగా, గుర్తింపుగా దీపమును చూపడము జరిగినది. ఈ విధానమంత తెలియుటకు ప్రత్యేకించి సంవత్సరములో ఒక రోజును ఎన్నుకొని, ఆ దినమున ఇంటిలోపల మరియు ఇంటి బయట దీపమును వెలిగించి దాని వివరమంతయు చెప్పడము జరిగినది. ఆ దినము అందరు ఇంటి లోపల ఒక దీపము, బయట ఒక దీపము వెలిగించి దాని అర్థమును చెప్పించుకొనెడివారు. మనిషిలోని అజ్ఞానమును తీసివేసి జ్ఞానమును కల్గించుటకు చేయు ఆచార క్రియ కావున, ఆ కార్యమును ఒక పండుగగా చేయడము జరిగినది. అజ్ఞానము చీకటికి గుర్తు, జ్ఞానము వెలుగుకు గుర్తు. కావున చీకటి రోజయిన అమావాస్య రోజున దీపమును పెట్టి చూపడము జరుగుచున్నది. ప్రతి సంవత్సరము ఆశ్వీయుజ మాసములో వచ్చు అమావాస్య రోజున ఈ విధానము దీపావళి పండుగగా చేసుకోవడము జరుగుచున్నది.

మనిషి శరీరము లోపల, శరీరము బయట జ్ఞానమును కల్గియుండాలను ఉద్దేశ్యముతో, శరీరమును మనము నివసించు గృహముగా పోల్చి, ఇంటిలోపల దీపము, ఇంటి బయట దీపము పెట్టునట్లు పెద్దలు చెప్పారు. జ్ఞానము యొక్క ఉద్దేశ్యమును తెలుపు సాంప్రదాయ పండుగ కావున పూర్వము ఇంటి లోపల ఒక దీపము, ఇంటి బయట ఒక దీపమును ఉంచెడివారు. నేడు పూర్వము ఏర్పరచిన అర్థము ఆచారము తెలియకుండా పోయి అలంకారము కొరకు ఎక్కువ దీపాలు పెట్టే దానికి మనుషులు అలవాటు పడిపోయారు. దీపము ద్వారా వెలుగు వస్తున్నదనీ, దీపము వెలుగుటకు కారణము అగ్నియనీ, అగ్ని దీపమునకు కారణమైనదిగా ఉండి ఎవరికీ తెలియనిదిగా ఉన్నదనీ, అలాగే శక్తికి కారణమైన దేవుడుగానీ, జ్ఞానమునకు కారణమైన గురువుగానీ ఎవరికీ తెలియకున్నారనీ, ఇటు దేవున్ని, అటు గురువును తెలియునిమిత్తము ఈ విధానమైన దీపావళి చేస్తున్నామని ఎవరూ నేడు అనుకోవడములేదు. దీపము వలన వెలుగు వచ్చి చీకటిని పారద్రోలినట్లు, జ్ఞానము వలన ఆనందము లభ్యమై దుఃఖము దూరమైపోవునని తెలియునట్లు, మంచి ఉద్దేశ్యముతో పూర్వము దీపావళి పండుగను ఏర్పరచారని మరువకూడదు. అయితే నేడు నాగులచవితి, వినాయకచవితి మారిపోయినట్లు దీపావళి అమావాస్య కూడా చివరకు పురాణకథగా మారిపోయి నరకాసురుని సంహరించిన దినముగా చెప్పబడుచున్నది. పూర్వము ప్రశాంతముగా జ్ఞానభావముతో చేసుకొను దీపావళి నరక చతుర్థశిగా మారిపోయి, ధమాకా శబ్ధము (టపాకాయల శబ్ధము)లతో ప్రశాంతతగానీ, జ్ఞానభావముగానీ లేకుండా పోయినది. ఇప్పటి నుంచయినా టపాకాయల శబ్ధము లేకుండా ప్రశాంతముగా, అర్థముగల ఆచారముగా దీపావళి పండుగను చేసుకొందాము.


గ్రంథసేకరణ: **మన పండుగలు** (25వ పేజీ)

# భోగిమంటలు

దక్షిణాయణము అజ్ఞాన సంబంధ, ప్రపంచ సంబంధ గుర్తు. ప్రపంచ అనుభవములకు తార్కాణముగ ఉన్న దక్షిణాయణమును భోగి అను పేరుతో చివరిదినమున గుర్తు చేసుకొనుచు, మా జీవితములలో కూడ నేటి నుండి భోగములు పోయి యోగములు రావాలని పూర్వము కోరుకొనెడివారు. భోగములు అనగ అనుభవములకు కారణమయిన కర్మపోవాలని, భగవద్గీతలో చెప్పినట్లు కర్మలను కట్టెలుగ, జ్ఞానమును అగ్నిగ పోల్చి ఆ రాత్రికి మంటలు వేసెడివారు. **అనుభవమునకు రాబోవు కర్మలను లేకుండ చేయడమునకు చిహ్నమే భోగి మంటలు.** దక్షిణాయణము చివరిలో భోగములకు స్వస్తి చెప్పడము, భోగిమంటలు మండించడము, అలాగే ఉత్తరాయణము మొదటిలో యోగమునకు ఆహ్వానము పలుకడము సంతోషకరమైన విషయము. కావున ఆ దినమును సంక్రాంతి ఉత్సవముగ పండుగ చేసుకొనుట పూర్వాచారము. పూర్వము పెద్దలు భావయుక్తముగ చేసిన ఆచారము నేటికిని జరుగుచున్నప్పటికి భోగి అని ఎందుకు అంటున్నామో, భోగిమంటలు ఎందుకు వేస్తున్నామో, సంక్రాంతి పండుగ ఎందుకు చేస్తున్నామో తెలియదు.

**"జ్ఞానాగ్ని సర్వకర్మాణాం భస్మసాత్" జ్ఞానమను అగ్నిచేత సర్వకర్మలు భస్మీపటలమగునని గీతయందు భగవంతుడు చెప్పాడు.** భోగికున్న కర్మలను జ్ఞానమను అగ్నికాల్చడమునే భోగి మంటలు అంటున్నాము. సంక్రాంతికంటే ముందు దినము అజ్ఞానమునకు చివరిదినము కావలెననీ, సంక్రాంతి మొదటి దినము జ్ఞానమునకు ఆరంభదినము కావలెననీ, అంతరార్థమును బాహ్యార్థముగ తెల్పుచు పూర్వము భోగి మంటలను వేయగ ఆనాటి ఆచారము ఈనాటికి ఉన్నది. ఆచారముంది అర్థము లేదు. ఈనాటి ఆచారమునకు ఆనాటి అర్థమును జోడించుకొని భోగిమంటలు వేయడము చేస్తే ఎంతో విలువతో కూడుకొన్న పని అగును. కావున ఈ రోజు ఉద్దేశ్యముతో పనిచేస్తే ఒకనాటికది నెరవేరును. ఉద్దేశ్యము లేని పని వ్యర్థం. **కావున బజారులో భోగిమంటలు మండించితే ప్రయోజనము లేదు. మన తలలో భోగములకు కారణమైన కర్మలను జ్ఞానమంటలతో మండించవలెను.** ఇప్పటికైన విలువ అర్థము తెలిసి భోగిపండుగ చేస్తాము. శరీరములో జ్ఞానమను అగ్నిని చేకూర్చుకొని కర్మలను కాల్చగలమను అర్థముతో బయట భోగి మంటలను మండిస్తాము.

**- ఇందూ జ్ఞాన వేదిక**


భోగి మంటల యొక్కరహస్యం
జ్ఞాన యజ్ఞము
మన తలలో ఉన్న
కష్ట-సుఖాలైనటువంటికట్టెలను,
జ్ఞానమనే అగ్నికి దహనం చేయడమే...
భోగి మంటల యొక్కరహస్యం
దీన్నే గీతయందు జ్ఞాన యజ్ఞము
అని భగవంతుడు తెలిపాడు.
WWW.THRAITHASHAKAM.ORG

గ్రంథసేకరణ: **మన పండుగలు** (27వ పేజి)

# సంక్రాంతి

ఎప్పటికీ మంచి తిరుగుబాటైనది సంక్రాంతియే! సంక్రాంతి వ్యక్తిగత తిరుగుబాటు, కానీ సామూహిక తిరుగుబాటు కాదంటున్నాము. సంక్రాంతికంటే ముందు భోగిమంటలను చూపినవాడు దక్షిణాయణము చివరిలో వాంఛలన్నిటినీ లేకుండ చేస్తున్నానను ఉద్ధేశ్యమును బయటికి ప్రకటించిన తర్వాత ఉత్తరాయణం ప్రారంభములో నేను భోగిగా కాకుండ ఇప్పటినుండి యోగిగా ఉంటానని ఆ దినము సంక్రాంతిని ప్రకటించుచున్నాడు. శరీరములోగల అహము మీదగానీ, మనస్సుమీదగానీ జీవుడు తిరుగుబాటును ప్రకటించడము మంచి తిరుగుబాటని సంక్రాంతి అనుచున్నాము.

**మనస్సు మీద తిరగబడితే బ్రహ్మయోగిగా,**

**అహము మీద తిరుగబడితే కర్మయోగిగా**

**మనిషి మారగలడు.**

ఇది వ్యక్తిగత తిరుగుబాటు, వారవారి శరీరములో జీవుడు ఒక్కడే చేయు తిరుగుబాటు. జీవుడు తన శరీరములో అంతవరకు మనస్సు చెప్పినట్లు, అహము చెప్పినట్లు వినెనివాడు. ఆ విధముగా వినడము వలన ప్రతి ఒక్కరూ అజ్ఞానస్థితిలో ఉన్నట్లేయగును. అంతేకాక అటువంటివాడు యోగాకాడనీ, అతను భోగి మాత్రమే అగునని పెద్దలు తెలియబరిచారు.

**కర్మ అనుభవములకు గుర్తు భోగి,**

**కర్మ నాశనమైన యోగమునకు గుర్తు సంక్రాంతి.**

- ఇందూ జ్ఞాన వేదిక

# సంక్రాంతి

సంక్రాంతి = సం+క్రాంతి. "సం" అనగా "మంచి" అని, "క్రాంతి" అనగా "తిరుగుబాటు" అని అర్ధము. సంక్రాంతి అనగా"మంచి తిరుగుబాటు". సంక్రాంతి అనగా వ్యక్తిగతంగా అంతరములో జరుగు తిరుగుబాటు.

ప్రతి జీవి ఉత్తమమైన ఉత్తరాయణము ప్రారంభములో "నేను భోగిగా కాక ఇప్పటినుండి యోగిగా ఉంటానని ఆ దినమున "సంక్రాంతి"ని ప్రకటించవలెను".


శరీరములోగల అహముమీద కానీ, మనస్సుమీద కానీ జీవుడు ప్రకటించే తిరుగుబాటే సంక్రాంతి. మనస్సుమీద తిరగబడితే "బ్రహ్మయోగిగా", అహముమీద తిరగబడితే "కర్మయోగిగా" ఆ జీవుడు మారిపోగలడు.

www.thraithashakam.org

# శివరాత్రి జాగరణ సరదాలకోసమా ?

శివరాత్రి కర్మనిర్మూలనకు, మోక్షప్రాప్తికి గుర్తకావలెను, కానీ కర్మ సంపాదనకు గుర్తుకాకూడదు నేటి కాలములో శివరాత్రి దినమున కొందరు జాగరణ అను పేరుతో రాత్రిపూట మేల్కొనుచున్నారు. ఆ దినము మేల్కొనవలెనని తెలుసు, కానీ ఎందుకు మేల్కొవాలి? మేల్కొని ఏమి చేయాలని తెలియదు శివరాత్రి దినమున రాత్రికి సినిమాలు, షికార్లు, త్రాగడము, వేశ్యలతో గడపడము చేయుచున్నారు. కొందరైతే గర్ల్‌ఫ్రెండ్‌తో ఎంజాయి చేశానని గర్వముగా చెప్పుకొటున్నారు. ఈ విధముగా నేటి సమాజములో యువత మారిపోవుచుండగా, పెద్దవారు ఏమి పట్టనట్లున్నారు. ఎన్ని పాపములు చేసినా వేయిరూపాయలు ఖర్చుపెట్టి శివునికి అభిషేకము చేశాములే అవే పోతాయనుచున్నారు. పూజలు చేయు పండితులు కూడా పాపపరిహారార్థము పూజలున్నాయనుచున్నారు. దానివలన పాపము యొక్క భయము ఎవరికీ లేకుండాపోయి డబ్బులు ఖర్చు పెట్టి పూజలో, అభిషేకములో చేస్తే పాపము పోతుందను భావము అందరిలోను ఉన్నది. దానితో శివరాత్రి దినమున కూడ ఆ పండుగ సరదాకోసమే అన్నట్లు చేయుచున్నారు. సాంప్రదాయము ప్రకారము పండుగ రోజున, గడచిన కాలమును గురించి యోచించి, నేను ఎంత పండినానని లెక్క చూచుకోవలసియున్నది. కర్మను పోగొట్టుకొనుటకు కావలసిన జ్ఞానము కొరకు వెతుక్కోవలసియున్నది. తాము మాయ నుండి జాగృతిపడుచు ఎదుటివారిని కూడ జాగ్రత్త చేయవలసిన దినము కావున 'శివరాత్రి జాగరణ' అని ఆ రాత్రిని అన్నారు. అంతేకాని నిద్రపోకుండ మేల్కొనడము జాగరణ కాదని తెలియవలెను.

# పీర్లు




ఇందూ మతములో శాస్త్రములుకాక పురాణములు కూడ ఉన్నట్లు ముస్లిమ్ మతములో కూడ చంద్రుదు నక్షత్రమును గూర్చి రెక్కల గుఱ్ఱమును గూర్చి పీర్లను గూర్చి కొన్ని కథలుండవచ్చును. అయినప్పటికి దేవునికి సన్నిహితముగ మనము వాటి అర్థములు చెప్పుకోవడములో తప్పులేదు. రేకుతో తయారు చేయబడిన గుండ్రని భాగము పీరుగ నుండును. ఆ గుండ్రని భాగమునకు పైన మూడు కొమ్ములుగ రేకులనమర్చి ఉందురు. ముక్కు నోరు ఆకారము లేని గుండ్రని ఆకారమునకు ముఖ్య అలంకారములుగ పైన మూడు రేఖలు నామములవలె తయారుచేసి ఉందురు. ముక్కు ముఖము అను గుర్తింపులేని ఆకారమును ఆత్మ స్వరూపముగ అర్థము చేసుకోవాలి. అలా చూపడములో ముఖ్య ఉద్దేశము దేవునికి ఆకారము లేదని తెలియజేయడమే. ఆకారములేని దేవుడు ప్రపంచములో జీవాత్మ, ఆత్మ, పరమాత్మలుగ మూడు భాగములై నిలచి ఉన్నదని తెలుపడమే పై మూడు నిలువు రేఖల గుర్తింపు. ముఖ్యముగ కనిపించు మూడు రేఖలలో ప్రక్కల రెండు చిన్నవిగ మధ్యలోనిది పెద్దదిగ ఉండును. అలాగే ప్రక్కరేఖలు రెండు ప్రక్కలకు వంచి ఉన్నట్లు మధ్యలోది వంగక నిటారుగ ఉన్నట్లు కనిపించుచుండును. ఎటు తిరిగి ఏ పీరుకయిన ప్రక్కవాటికంటె మధ్యనున్నది ప్రత్యేకముగ ఉండునట్లు తయారు చేసి ఉందురు. చూచేవారికి కుడిప్రక్క కనిపించు రేఖ జీవాత్మయనియు ఎడమ ప్రక్క కనిపించు రేఖ ఆత్మ అనియు గుర్తించుకోవాలి.అట్లే మధ్యలోనున్న రేఖ పరమాత్మగ గుర్తించుకోవాలి. భూమి మీద పరమాత్మ క్షరాక్షర పురుషోత్తములుగ ఉన్నాదని అంతటికి ఆదికర్తయి ఇందువుల చేత పరమాత్మగ, క్రైస్తవుల చేత యెహెూవాగ, ముస్లీమ్‌ల చేత అల్లాగ పిలువబడు వాని నుంచి ఒక ప్రక్క జీవుడు మరొక ప్రక్క ఆత్మ పుట్టి ప్రపంచములో జీవకోటి తయారయినదని సూచించు గుర్తుయే పీరు యొక్క ఆకారము.

దేవుడిటువంటివాడని తెలిసిన పెద్దలు ప్రజలకు తెలియబరుచుటకై ఎన్నో తతంగములు చేశారు. అటువంటి వారి ఉద్దేశములలో పీరు కూడ ఒక ముఖ్య ఉద్దేశమే. సంవత్సరమునకొక మారు పీర్లను ఊరేగించడము అలంకరించడము ఆరాధించడము ఉత్సవములు చేయడము జరుగుచున్నది. కాని పూర్వపు పెద్దలుంచిన భావము ఏ మాత్రము తెలియకుండ పోయినది. ఈనాడు పీర్లు ఊరేగింపు ఇందువులు ముస్లీమ్ లు కలసి చేయుచున్నారు. ఇదొక తతంగముగ చేయుచున్నారు. పూర్వపు భావము ఏ మాత్రము కనిపించకపోగ పీర్లను కూడ కోర్కెలు కోరే మనుషులు తయారయినారు.పీర్ల దగ్గర భక్తి భావము కొద్ది మందికి ఉండగ ఎక్కువ మంది మత్తుతాగి ఎగిరేవాల్లే ఎక్కువమంది కనిపిస్తున్నారు. పీర్లను దైవముగ తలచి వాటి ముందర మా కర్మయంతటిని లేకుండ చేసుకుంటామను భావముతో పూర్వపు పెద్దలు అగ్నిగుండమును కాయించి అందలో కట్టెలని వేసి కాల్చి చూపెడివారు. శరీరమను గుండములో జ్ఞానమను అగ్నిచేత కర్మలను కట్టెలను కాల్చి నీలోనికి ఐక్యమగుదుమని చూపిన ఆనాటి క్రియ ఈనాటికి ఉన్నను కట్టెలను కర్మలని అగ్నిని జ్ఞానమని గుండమును శరీరమని పీరును దైవమని గుర్తించేవారే కరువైనారు. పీర్ల పండుగ సారా తాగేదానికి మాంసము తినేదానికి ప్రతీకగ ఉన్నది. ఈనాటి అల్లరి పద్ధతిని వదలి పూర్వపు జ్ఞానుల పద్ధతిని అలవరించుకొంటే పీర్ల పండుగకు పవిత్రత చేకూర గలదు.